ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 30 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 13 మే 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## టెస్టు క్రికెట్‌కు
# కోహ్లీ గుడ్‌బై



### సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్టు

14 ఏళ్లు టెస్టులు ఆడాడు. టెస్టుల్లో అత్యధిక స్కోర్లు చేసిన నాలుగవ ఇండియన్ బ్యాటర్. అత్యధిక టెస్టు మ్యాచ్‌లకు కెప్టెన్‌గా చేశాడు. టెస్టు కెప్టెన్‌గా అత్యధిక విజయాలు నమోదు చేశాడు. టెస్టుల్లో ఇండియాను నెంబర్ వన్ స్థానంలో సుదీర్ఘకాలం నిలిపాడు. ఆస్ట్రేలియాలో తొలిసారి టెస్టు సిరీస్‌ను అందించిన ఘనతను సొంతం చేసుకున్న విరాట్ కోహ్లీ ఆ టెస్టు ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పేశాడు. సోషల్ మీడియా ద్వారా తన రిటైర్మెంట్‌ను ప్రకటించాడు.

## ఉగ్రవాదులను ఉసిగొల్పితే
# చావుదెబ్బ కొడతాం

- ఉగ్రవాదుల మాటున అణు బెదిరింపులను సహించం
- మితో చర్చలంటూ సాగితే..ఉగ్రవాదం..పీవోకే పైనే
- ఇందులో మూడో వ్యక్తి జోక్యాన్ని కూడా సహించం
- నీళ్లూ..రక్తం కలసి ఒకేచోట పారలేవు
- ఉగ్రవాదంతో వాణిజ్యం కలసి సాగలేదు
- ఆపరేషన్ సిందూర్ విజయవంతం
- పాక్‌లో ఉగ్రవాదులను చావుదెబ్బకొట్టాం
- ఉగ్రతండాలను తుదముట్టించాం
- ఉగ్రవాదులకు అండగా నిలిస్తే...ఇలాగే సమాధానం ఇస్తాం
- త్రివిధ దళాలు ఎప్పుడూ దాడులకు సిద్ధమే
- మన సైనిక శక్తిని చాటిన దళాలకు సెల్యూట్
- మనసత్తా ఏమిటో ప్రపంచం కూడా చూసింది
- జాతిని ఉద్దేశించి ప్రధాని మోడీ ఉద్వేగ పూరిత ప్రసంగం




**న్యూఢిల్లీ, మే 12 (ప్రభాత ఉదయం):**

పాకిస్తాన్ కాచుకో..ఇకముందు ఎలాంటి పిచ్చి వేషాలు వేసినా నామ రూపాల్లేకుండా తుదముట్టిస్తామని ప్రధాని మోడీ హెచ్చరించారు. ఆపరేషన్ సింధూర్‌ను తాత్కాలికంగానే పక్కన పెట్టాం..పూర్తిగా ఆపేయలేదని, ఎలాంటి టెర్రర్ అటాక్ జరిగినా ఇక దానిని యుద్ధంగానే పరిగణిస్తామని ప్రధాని మోడీ ఘాటుగా హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్ ..మిగతా 2లో



అద్భుత అధ్యాయం
## ముగిసింది
### సీఎం రేవంత్ రెడ్డి

టెస్టు క్రికెట్ నుంచి విరాట్ కోహ్లీ రిటైర్మెంట్‌తో భారత క్రీడా చరిత్రలో ఓ అద్భుత అధ్యాయం ముగిసిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. క్రికెట్‌లో అతడి అభిరుచి, క్రమశిక్షణ చాలా మందిలో స్ఫూర్తిని నింపాయన్నారు. విరాట్ కోహ్లీ దేశానికే గర్వకారణమని, అతడి తదుపరి ప్రయాణం.. విజయపథంలో సాగాలని ఆకాంక్షించారు.



పెళ్లి వాహనాన్ని
## ఢీకొన్న ట్రక్కు
### ప్రమాదంలో 13 మంది దుర్మరణం

**రాయ్‌పూర్, ప్రభాత ఉదయం**


ఛత్తీస్‌గఢ్‌లో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదంజరిగింది. ఈ ఘటనలో 13 మంది మృతి చెందగా.. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. రాయ్‌పూర్ బలోద బజార్ దగ్గర ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రయాణికులతో వస్తున్న ..మిగతా 2లో

చైనా మిస్సైళ్లను
## వాడిన పాకిస్తాన్
### కూల్చేసిన భారత్ సైన్యం
### కీలక విషయాలు వెల్లడించిన సైనికాధికారులు




**న్యూఢిల్లీ, మే 12 (ప్రభాత ఉదయం):**

భారత్, పాకిస్తాన్ ఉద్రిక్తతలు చల్లబడ్డాయి. కానీ మూడు, నాలుగు రోజుల వ్యవధిలో పాకిస్తాన్ వైపు నుంచి వచ్చిన డ్రోన్లు, క్షిపణుల గురించి సంచలన విషయాలు వెలుగు చూశాయి. భారతదేశం ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన తర్వాత పాకిస్తాన్ దాడులు చేసిదరి. పాకిస్తాన్ ఉపయోగించిన వాటిలో చైనా తయారీ 15 క్షిపణులు కూడా ఉన్నాయి. వాటిని వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేసినట్లు భారత వైమానిక దళం సోమవారం (మే 12) ప్రకటించాయి. పాక్ సైన్యానికి జరిగిన నష్టానికి పాకిస్తాన్ బాధ్యత వహించాలని సాయుధ దళాలు తెలిపాయి. భారతదేశ వైమానిక రక్షణ వ్యవస్థ బలంగా ఉందని , పాకిస్తాన్ ఆ వ్యవస్థ జోలికి రాలేకపోయిందని స్పష్టం చేసారు. మా పోరాటం ఉగ్రవాదులు, ..మిగతా 2లో




## జీకేసీ హబ్‌గా హైదరాబాద్
### సొనాటా సాఫ్ట్ వేర్ ఫెసిలిటీ సెంటర్ ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: మే 12 (ప్రభాత ఉదయం): సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థ నూతన ఫెసిలిటీ సెంటర్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. సొనాటా సాఫ్ట్‌వేర్ అత్యాధునిక %ూ×% ని ఉపయోగించి పర్యావరణ వ్యవస్థలను రూపొందించడం గర్వకారణం అన్నారు. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ రంగంతో పాటు లైఫ్ సైన్సెస్ రంగం, ఇంకా పలు రంగాల్లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌కు హబ్‌గా మారిందన్నారు. ఈ సందర్భంగా సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థ ఉద్యోగులు, యాజమాన్యం, అందరికీ అభినందనలు తెలిపారు.

**అటు అభివృద్ధి, ఇటు సంక్షేమం**

హైదరాబాద్ -రెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకు కేంద్రంగా మారింది. మైక్రోసాఫ్ట్, %ఎజూ% టెక్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, విప్రో వంటి ఐటీ దిగ్గజాలు తమ క్యాంపస్‌లను మన వద్ద విస్తరిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత, సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం పనిచేస్తూనే మరోవైపు పరిశ్రమలకు మద్దతిస్తూ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది.

**రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులు, 1 లక్షకు పైగా ఉద్యోగాలు**

డిసెంబర్ 2023 నుంచి ఇప్పటివరకు తెలంగాణకు కొత్తగా రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులు తేవడంతో పాటు రాష్ట్రంలో 1 లక్షకు పైగా ఉద్యోగాలు సృష్టించాం. 2025లో స్విట్జర్లాండ్ లోని దావోస్‌లో జరిగిన ఆర్థిక సదస్సులో పాల్గొని ..మిగతా 2లో

## హైడ్రాతో రేవంత్ దారుణంగా వ్యవహరిస్తున్నారు
### సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడిన బీజేపీ ఎంపీ ఈటల
### ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా సైకోలా వ్యవహరిస్తున్నారు: ఈటల రాజేందర్

**హైదరాబాద్, మే 12 (ప్రభాత ఉదయం):**



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా మండిపడ్డారు. హైడ్రాతో ముఖ్యమంత్రి దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 1965లో అల్వాల్ లో 50 ఏళ్ల క్రితం ఏర్పడ్డ ఓ కాలనీ ఉంది.. ఈ కాలనీకి ఇంటింటికీ నోటీసులు ఇవ్వడమే కాకుండా.. చివరికి గుడులకు కూడా నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. ఒక తరం త్యాగం చేస్తే.. రెండో తరం ఇల్లు కట్టుకుంది.. మూడో తరం చదువుకుంటోంది అని గుర్తు చేశారు. బాలాజీ నగర్, అరుందతి నగర్ లో ఇలా ఉంది పరిస్థితి.. ఇక, ప్రజల జీవనంలో మంచి మార్పు వస్తదని ముఖ్యమంత్రిని చేస్తే.. నేను ఎవరు చెప్పినా వినను.. నాకు నేను నిర్ణయం తీసుకుంటానంటున్నాడు.. హైడ్రా పేరుతో పక్కా ..మిగతా 2లో

## అమర్‌నాథ్ యాత్ర కౌంట్‌డౌన్ స్టార్ట్



**న్యూఢిల్లీ, మే 12 (ప్రభాత ఉదయం):**

అమర్‌నాథ్ యాత్ర జూలై 3న ప్రారంభమై ఆగస్టు 19న రక్షా బంధన్ పండుగతో ముగుస్తుంది. ఎప్పటిలాగే దేశం నలుమూలల నుండి భక్తులు అమర్‌నాథ్ గుహని దర్శించే ఆధ్యాత్మిక ప్రయాణానికి సిద్ధమవుతున్నవారు. బాబా బర్ఫానీ, శివుడి ఆశీస్సులకోసం ఎప్పుడెప్పుడాని పరితపిస్తున్నారు. మరోవైపు, అమర్‌నాథ్ యాత్రకు కౌంట్‌డౌన్ ప్రారంభమవుతున్న తరుణంలో, భక్తులు మంచుతో సహజ సిద్ధంగా ఏర్పడే పురాణ శివలింగాన్ని వీక్షించడానికి పవిత్ర ప్రయాణం కోసం ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ ఏడాది యాత్ర అధికారికంగా ప్రారంభానికి రెండు నెలల ముందు నుంచే భక్తుల్లో ఉత్సాహం ఉరకలెత్తుతోంది. భారీగా హిమపాతం ఉన్నప్పటికీ యాత్రికుల రిజిస్ట్రేషన్లు ఇంకా ఇంకా పెరుగుతుండటంతో అధికారులు ..మిగతా 2లో



## పెళ్లి వాహనాన్ని ఢీకొన్న ట్రక్కు


మొదటి పేజీ తరువాయి...

ప్యాసింజర్ వాహనాన్ని అతి వేగంగా వస్తున్న ట్రక్కు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో 9 మంది మహిళలు, నలుగురు చిన్నారులు మృతి చెందారు. ప్రమాదంలో 30 మంది గాయపడ్డారని, వారిని ఆస్పత్రికి తరలించినట్లు- రాయ్‌పూర్ ఎస్పీ లాల్ ఉమ్మెద్ సింగ్ వెల్లడించారు. ఓ వివాహ వేడుకకు వెళ్లి చౌతియా ఛత్తీ నుంచి రాయ్‌పూర్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని ఎస్పీ వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు- రాయ్‌పూర్ ఎస్పీ లాల్ ఉమ్మెద్ సింగ్ తెలిపారు. కాగా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు- సమాచారం.

## చైనా మిస్సైళ్లను వాడిన పాకిస్తాన్

మొదటి పేజీ తరువాయి...

వారి మద్దతుగా ఉన్న వ్యవస్థలపైనేనని యిర్ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ ఎయిర్ మార్షల్‌భారతి స్పష్టం చేశారు. తాము పాకిస్తాన్ సైన్యంతో యుద్ధం చేయలేదన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాద శిబిరాలపై మాత్రమే దాడి చేశామని.. కానీ పాకిస్తాన్ సైన్యం ఉగ్రవాదుల తరపున పోరాడుతుండటం దురదృష్టకరమని ఎయిర్ మార్షల్ భారతి అన్నారు. పాకిస్తాన్ వివిధ రకాల డ్రోన్లను వినియోగించింది.. దేశీయంగా తయారు చేసిన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో మనం వాటిని అడ్డుకున్నామని ఏ ఎన్ భారతి తెలిపారు. . ఆకాశ్ డిఫెన్స్ వ్యవస్థతో శత్రువులను దీటుగా ఎదుర్కొన్నామని తెలిపారు. పాక్ ప్రయోగించిన మిస్సైళ్లను ఆకాశ్ క్షిపణులతో నిర్వీర్యం చేశామని తెలిపారు. పాక్ లోని నూర్‌ఖాన్ ఎయిర్ బేస్‌పై ఇండియన్ ఎయిర్ ఫోర్స్ దాడి చేసింది. నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ రన్ వే కు తీవ్ర నష్టం జరిగింది. దేశ ప్రజలంతా మాకు అండగా నిలిచారని ఎయిర్ మార్షల్ సంతృప్తి వ్యక్తంచేశారు. శత్రువుల విమానాలను మన దేశం లోకి రాకుండా అడ్డుకున్నాం.. మన అన్ని సైనిక స్థావరాలు సిద్ధంగా ఉన్నాయి.. ఎలాంటి ఆపరేషన్‌కు అయినా మేం సన్నద్ధంగా ఉన్నామని ప్రకటించారు. పాక్‌కు జరిగిన డ్యామేజీ ఆ దేశం చెప్పుకోవడం లేదన్నారు. మరో వైపు భారతదేశం , పాకిస్తాన్ మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ మధ్య చర్చలు సోమవారం (మే 12) సాయంత్రం వరకు వాయిదా పడ్డాయి. ఈ రోజు మధ్యాహ్నం చర్చలు జరగాల్సి ఉంది.దాడుల్లో భారత్ పూర్తిగా సంయమనం పాటించిందని.. సామాన్య ప్రజలపై ఎలాంటి దాడులు చేయలేదన్నారు. కానీ పాకిస్తాన్ మాత్రం అమాయక పౌరులను టార్గెట్ చేసుకుందని సైనికాధికారులు తెలిపారు.




## వీధి కుక్కలను దత్తత తీసుకోవడం అభినందనీయం

**అన్నం పెట్టిన విశ్వాసంతో అపరిచితులను ఇంట్లోకి రానీయకుండా కాపలా కాస్తాయి**

**ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

కూకట్‌పల్లి,మే 12 (ప్రభాత ఉదయం) వీధి కుక్కలను దత్తత తీసుకోవడం అభినందనీయమని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పటేల్ కుంట పార్క్ లో జిహెచ్ఎంసి వెటర్నరీ డాక్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన వీధి కుక్కల దత్తత కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై వారి చేతులమీదుగా కుక్క పిల్లలను దత్తత తీసుకునేవారికి అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి వెటర్నరీ శాఖ వారు నిర్వహించిన వీధి కుక్కల దత్తత కార్యక్రమం అభినందించదగ్గ విషయం అని అన్నారు. వీధి కుక్కలను దత్తత తీసుకోవడం వలన అవి ఎంతో విశ్వాసంగా ఉండి దొంగలను, అపరిచితులను ఇంటిలోకి రానియ్యకుండా అవి కాపాలా ఉంటాయని అన్నారు. రెండు పూటలా అన్నం పెడితే చాలు మీ ఇంటి నేస్తాలై మీ కుటుంబాన్ని సంరక్షిస్తాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాలుగు పప్పీస్ ను పార్కులో మార్నింగ్ వాకింగ్ వచ్చేవాళ్ళు దత్తత తీసుకున్నారు. అయితే దత్తత ఇచ్చిన కుక్క పిల్లలను కూడా నెలకి ఒక్కసారైనా వాటి సంరక్షణ ఎలా ఉందో చూడాలని వెటర్నరీ వారికి సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, గాజులరామారం సర్కిల్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగార్జున, డిప్యూటీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి, డాక్టర్ దీపక్, మురళి, గణేష్, శ్రీకాంత్, సాయి, శీను తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదులను ఉసిగొల్పితే చావుదెబ్బ కొడతాం

మొదటి పేజీ తరువాయి...



ద్వారా పాక్ భూభాగంలో టెర్రరిస్ట్ క్యాంపులను ధ్వంసం చేశామని ప్రకటించారు. అలాగే మన సత్తా ఏమిటో ప్రపంచానికి, ముఖ్యంగా పాకిస్థాన్‌కు చాటాని అన్నారు. ఈ క్రమంలో సైనిక దళాలకు ఆయన సెల్యూట్ చేశారు. పాక్‌తో చర్చలంటూ జరిగితే... టెర్రరిజం, ఆక్రమిత కాశ్మీర్‌పైనే ఉంటుందన్నారు. ఇందులో మూడో వ్యక్తి జోక్యాన్ని కూడా సహించబోమన్నారు. ఆపరేషన్ సిందూర్ తరవాత ప్రధాని మోడీ సోమవారం రాత్రి జాతిని ఉద్దేశించి ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. టెర్రరిజం, భారత్‌పై దాడులు, అమాయక ప్రజల ఉచకోతలను ప్రధానంగా ప్రస్తావించారు. పహల్‌గామ్ ఊచకోత వ్యక్తిగతంగా తనను ఎంతగానో కలచి వేసిందన్నారు. ప్రజలంతా ఒక్కటిగా ఈ ఘటనపై శాస్తి జరగాలని కోరుకున్నారని, ప్రజల ఆకాంక్షల మేరకు భారత రక్షణ దళాలు వందమంది టెర్రరిస్టులను సమూలంగా సర్వనాశనం చేశాయని అన్నారు. ఉగ్రవాదుల తండాలను ధ్వంసం చేశాయని, ఉగ్రవాదులు కలలో కూడా ఊహించనంత దారుణంగా మన సైన్యం వారిని దెబ్బతీసిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సైనికుల పరాక్రమం, సాహసాలకు సెల్యూట్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ చర్యలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తుదముట్టిస్తామని స్పష్టం చేశారు. అణ్వాయుధాల ఆధారంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే సహించేది లేదని పాకిస్థాన్‌ను గట్టిగా హెచ్చరించారు. భారత్ నిర్ణయాలకు అనుగుణంగానే చర్చలు సాగుతాయని, ఇందులో ఎలాంటి అనుమానం లేదని ప్రకటించారు. గడిచిన నాలుగు రోజులుగా భారత సైన్యం సామర్థ్యాన్ని, సంయమనాన్ని చూస్తున్నాం. నిఘా వర్గాల సామర్థం, శాస్త్రసాంకేతిక సామర్థ్యాన్ని దేశం చూసింది. మన దేశం అసమాన వీరత్వాన్ని ప్రదర్శించింది. సైన్యం సాహసం, పరాక్రమాన్ని దేశం చూసింది. భారత రక్షణ దళాలు చూసిన ధైర్య సాహసాలు దేశానికి తలమానికం. పహల్గాంలో ఉగ్రవాదులు మతం పేరి అడిగి మరీ కుటుంబ సభ్యుల ముందు కాల్చి చంపారు. ఈ ఉగ్రదాడితో దేశమంతా నివ్వెర పోయింది. ఉగ్రవాద దాడులపై ప్రతి హృదయం జ్వలించింది. పౌరులు, పార్టీలు అన్నీ ఏకతాటిపైకి వచ్చి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలబడ్డాయి. భారతీయ మహిళల నుదిటిపై సిందూరం తుడిచేసే వారికి ఎలాంటి బుద్ధి చెప్పాలో అదే ఆపరేషన్ సిందూర్. ఉగ్రవాదులు కలలో కూడా ఊహించనంత దారుణంగా భారత్ దెబ్బతీసింది. ఉగ్రవాదుల శిబిరాలపై భారత మిసైళ్లు, డ్రోన్లు కచ్చితమైన లక్ష్యంతో దాడులు నిర్వహించాయి. బహావల్‌పూర్, మురుద్కే లాంటి తీవ్రవాద స్థావరాలపై దాడి చేసి భీతావహ పరిస్థితిని భారత్ సృష్టించింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉగ్రవాదులు, ఉగ్రవాద సానుభూతిపరులకు ఏం చేస్తుందో భారత్ చెప్పింది. పాక్ గర్వంగా చెప్పుకొనే మిసైళ్లను ధ్వంసం చేశాం. పాకిస్థాన్ విమానాలు గాల్లోకి ఎగరలేని పరిస్థితిని భారత్ తీసుకొచ్చింది. భారత్ చర్యలకు బెంబేలెత్తిపోయిన పాకిస్థాన్ కాల్పుల విరమణకు ప్రపంచం మొత్తాన్ని వేడుకుంది. పాక్ డీజీఎంవో కాల్పుల విరమణ చర్చలకు పరిగెత్తుకుంటూ వచ్చారని అన్నారు. ఓ రకంగా చెప్పాలంటే కాళ్ల బేరానికి వచ్చారని అన్నారు. రెండున్నర దశాబ్దాలుగా పాక్‌లో విచ్చలవిడిగా తిరుగుతున్న ఉగ్రవాద తండాలను ఒక్క దెబ్బతో భారత్ తుడిచిపెట్టింది. భారత్‌కు వ్యతిరేకంగా పాక్ నుంచి కుట్రలు పన్నుతున్న ఉగ్రతండాలను తుదముట్టించింది. భారత్ దెబ్బకు పాక్ నిరాశనిస్పృహల్లో కూరుకుపోయింది. అచేతనావస్థకు చేరుకుంది. దాడులతో ఏటూ పాలుపోని పాక్.. భారత్‌లోని జనావాసాలు, పాఠశాలలపై దాడికి దిగింది. పాక్ నుంచి ప్రయోగించిన డ్రోన్లు, మిసైళ్లను భారత్ క్షిపణి రక్షణ వ్యవస్థ సరిహద్దులు దాటకుండానే కూల్చేసింది. పాక్ రక్షణ వ్యవస్థలను భారత క్షిపణులు ఛిన్నాభిన్నం చేశాయి. పాక్ గర్వంగా చెప్పుఒకనే మిసైళ్లు, రక్షణ వ్యవస్థల్ని నిర్వీర్యం చేసింది. పాక్ వైమానిక స్థావరాలు, రాడార్ స్టేషన్లలో భారత్ మిసైళ్లు విధ్వంసం సృష్టించాయి. పాక్ యుద్ధ విమానాలు గాలిలోకి తిరగలేని స్థితిని భారత్ కల్పించంది. ఇందులో భారత స్వయం సమృద్ధికి సంబంధించిన టెక్నాలజీ కూడా ఉందన్నారు. ప్రపంచానికి తాము ఇదే చెప్పదల్చుకున్నామని అన్నారు. ఇకముందు టెర్రరిజంతో బ్లాకమెయిల్ చేస్తే ఊరుకునేది లేదన్నారు. పాక్ కూడా టెర్రిజానన్ని పక్కన పెట్టకుంటే అదే ఓనాడు ఆదేశాన్ని కబళిస్తుందని కూడా హెచ్చరించారు. ఎలాంటి దుస్సాహసానికి పాక్ తెగబడినా భారత్ దళాలు చావు దెబ్బ కొట్టేందుకు సిద్ధంగా ఉన్నాయి. సర్జికల్ ÷–టసైక్స్, బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్.. ఉగ్రవాదంపై భారత్ వైఖరిని విస్పష్టంగా చెప్పాయి. ఉగ్రవాదంపై భారత్ షరతుల మేరకే చర్చలు ఉంటాయి. భారత్ నిర్ణయాలకు అనుగుణంగానే చర్చలు సాగుతాయి. పాకిస్థాన్ అణు బ్లాక్‌మెయిలింగ్ ఇక సహించేది లేదు. అణుశక్తి, అణ్వాయుధాల ఆధారంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే, భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. ఉగ్రవాదం ఏ రూపంలో ఎక్కడ ఉన్నా భారత్ తుదముట్టించి తీరుతుందని ప్రధాని మోదీ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు గట్టిగా హెచ్చరికలు పంపారు. ఇకపోతే భవిష్యత్‌లో పాక్‌తో టెర్రరిజం, పివోకేలపైపే చర్చలు సాగుతాయన్నారు. అలాగే రక్తం, నీళ్లు ఒకేచోట్ ప్రవహించవన్నారు. ఉగ్రవాదం, వాణిజ్యం కలసి సాగలేవన్నారు. భారత ప్రజల రక్షణ విషయంలో రాజీలేదన్నారు. ఈరోజు బుద్ద పూర్ణిమ అంటూ..శాంతితో పాటు శక్తి కూడా కలసి ఉంటుందన్నారు. ఈ యుగం ఉగ్రవాదానికి చోటు లేదన్నారు. అలాగే యుద్ధాలకు కూడా వర్తించదన్నారు. శాంతిని భారత్ ఎప్పుడూ కోరుకుంటుందని, అలాగని చేతులు ముడుచుకుని కూర్చోదన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో బలగాలు ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. మన సైన్యం చూపిన

తెగువకు సెల్యూట్ చేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా భారత సైన్యానికి, శాస్త్రవేత్తలకు సెల్యూట్ చేస్తున్నట్లు- ప్రధాని మోదీ ప్రకటించారు. అమాయక పౌరులను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మన దేశం వీరత్వాన్ని చాటుకుందన్నారు. మన మహిళల సిందూరాన్ని దూరం చేస్తే.. ఏమవుతుందో చూపించామని చెప్పారు. ఉగ్రవాదులపై దాడులకు సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని గుర్తు చేశారు. సైన్యం చేసిన దాడికి పాకిస్థాన్ సైతం నివ్వెర పోయిందన్నారు. పాకిస్థాన్ నిఘా, సాంకేతికత భారత్ ముందు తేలిపోయిందని పేర్కొన్నారు. ఉగ్రవాదులను నియంత్రించాల్సిన పాక్ మనపై ఎదురు దాడి చేసిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ మన స్కూల్స్, ఆస్పత్రులు, గురుద్వారాలను టార్గెట్ చేసిందని వివరించారు. పాకిస్థాన్ డ్రోన్లు, మిస్సైల్స్ కూల్చివేశామని ప్రధాని మోదీ తెలిపారు. పాక్ మిస్సైల్స్ భారత్‌లోకి రాలేకపోయాయన్నారు. మనం మాత్రం పాకిస్థాన్ గుండెల్లో బాంబులు పేల్చామని చెప్పారు. పాకిస్థాన్‌లోని ఎయిర్‌బేస్‌లను సైతం ధ్వంసం చేశామన్నారు. మన దెబ్బకు పాకిస్థాన్ విలవిలలాడిపోయిందని ప్రధాని మోదీ గర్వంగా చెప్పారు. భారత్‌ను ఎదుర్కో లేక ప్రపంచ దేశాల సాయాన్ని పాకిస్థాన్ కోరిందని ఈ సందర్భంగా ప్రధాని మోదీ గుర్తు చేశారు. పాకిస్థాన్ చర్యలను బట్టే మన చర్యలు ఉంటాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడ్డా తిప్పికొడతామన్నారు. పాక్ అణు బ్లాక్ మెయిలింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని తెలిపారు. త్రివిధ దళాలు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఉగ్రవాదం అంతానికి అన్నిరకాల వ్యూహాలతో సిద్ధంగా ఉన్నామని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. పాక్ తోక జాడిస్తే తీవ్ర పరిణామాలు తప్పవంటూ ఆ దేశాన్నిహెచ్చరించారు. భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

## ప్రజావాణిలో వచ్చిన వినతుల సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం

**జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్**

**అర్జీలను పెండింగ్లో పెట్టొద్దు:**

**ప్రజావాణికి 46 ఫిర్యాదులు..**


ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రీతం

రంగారెడ్డి జిల్లా,మే12(ప్రభాత ఉదయం) ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్,జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలసి స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారన్నారు.ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 46 ఫిర్యాదులను వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు.రెవెన్యూ శాఖ %-% 21,ఇతర శాఖలకు %-%25, మొత్తం 46 దరఖస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు,కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## జీకేసీ హబ్‌గా హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి...

తెలంగాణ రూ. 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి దేశంలోనే నంబర్ 1 రాష్ట్రంగా నిలిచింది. దేశీయంగా, అంతర్జాతీయంగా పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. పోలీస్ వ్యవస్థ, శాంతిభద్రతలు, ద్రవ్యోల్బణం ఉద్యోగాల సృష్టి, పన్నుల వసూళ్లలో నంబర్ వన్ గా నిలిచాం.

**ఫ్యూచర్ సిటీలో ఏఐ సిటీ**

66 లక్షల స్వయం సహాయక బృందాల ద్వారా మహిళా సాధికారత, రాజీవ్ యువ వికాసం ద్వారా యువత వ్యాపారాలు, స్వయం ఉపాధికి అవసరమైన నిధులు ప్రభుత్వం అందిస్తోంది. హైదరాబాద్ ట్రాఫిక్ విధుల నిర్వహణలో ట్రాన్స్‌జెండర్ స్వచ్ఛంద సేవకులను నియమించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఫ్యూచర్ సిటీలో %ూ×% నగరం, డ్రై పోర్టు నిర్మాణం, ఆంధ్రప్రదేశ్ సముద్ర ఓడరేవుతో అనుసంధానం, యంగ్ ఇండియా స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీలు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం జరుగుతోంది. ప్రపంచంలోనే గొప్ప ఈవెంట్లలో ఒకటైన మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్ వేదికగా జరుగుతున్నాయి. మరిన్ని ప్రపంచ ఈవెంట్‌లను రాష్ట్ర ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది.

తెలంగాణ రైజింగ్ ప్రోగ్రామ్స్ ద్వారా ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాలు, మౌలిక సదుపాయాలు, సంక్షేమం రెండూ జరుగుతున్నాయి. ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో, హైదరాబాద్‌ను అత్యద్భుత నగరంగా మార్చడంలో అందరి సహకారం కోరుతున్నాం. హైదరాబాద్‌కు బ్రాండ్ అంబాసడర్లుగా మారండి. రాష్ట్ర విజయాలను ప్రపంచానికి చూపాలని' కోరారు.

**ఇన్వెస్టర్లకు ప్రభుత్వం సహకారం, ప్రోత్సహకాలు**

తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగాల కల్పనతో పాటు మహిళలు, రైతులు అన్ని వర్గాల వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు రేవంత్ రెడ్డి. దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్‌గా నిలుస్తోందని.. ప్రజా ప్రభుత్వంలో హామీల అమలు చేసి తీరుతామని చెప్పారు. పెట్టుబడుదారులకు హైదరాబాద్ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారిందని.. ఇన్వెస్టర్లకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహకాలు ఇస్తుందని రేవంత్ రెడ్డి ఆహ్వానించారు.

## అమర్‌నాథ్ యాత్ర కౌంట్‌డౌన్ స్టార్ట్

మొదటి పేజీ తరువాయి...

సన్నాహాలు ముమ్మరం చేస్తున్నారు. దురదృష్టకర పహల్గాం దాడి ఉన్నప్పటికీ, భక్తులలో ఉత్సాహం మాత్రం సడలలేదు. లక్షలాది మంది భక్తులు అమర్ నాథ్ యాత్రలో పాల్గొనడానికి ఆసక్తి చూపుతున్నారు. తాజా సమాచారం ప్రకారం, యాత్ర కోసం ఇప్పటికే 3,60,000 మందికి పైగా యాత్రికులు నమోదు చేసుకున్నారు. అధికారికంగా అమర్ నాథ్ యాత్ర మొదలయ్యే తేదీ దగ్గర పడుతున్న కొద్దీ ఈ సంఖ్య ఇంకా భారీగా పెరిగే అవకాశం ఉంది. మరోవైపు, యాత్రా మార్గాల్లో రికార్డు స్థాయిలో హిమపాతం కురుస్తోంది. అయినప్పటికీ ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్రకు సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. మంచుతో కప్పబడిన మార్గాలను యాత్రికుల కోసం క్లియర్ చేయడానికి అధికారులు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. రెండు ప్రధాన మార్గాలైన బాల్తాల్, చందన్‌వారీలలో మంచు తొలగింపు పనులు ఇప్పటికే ప్రారంభించారు. తద్వారా యాత్రికులు నడవడానికి ట్రాక్‌లు వీలుగా మారే అవకాశం ఉంది. అయితే, ఈ ఏడాది ఆయా మార్గాల్లో మంచు సాధారణం కంటే ఎక్కువగా ఉంది. దీంతో పనులు చేయడం సవాలుగా మారింది. కొన్ని ప్రాంతాలలో అయితే, మంచు 10 నుండి 20 అడుగుల వరకు ఉందని, ఇది మార్గాన్ని క్లియర్ చేయడంలో పాల్గొన్న వారికి చాలా అడ్డంకిగా ఉందని అధికారులు చెబుతున్నారు.పంజ్తరణి, శేషనాగ్ వంటి ప్రాంతాల్లో ప్రస్తుతం మంచు భారీగా ఉంది. అటు, తీర్థయాత్రకు జరుగుతున్న సన్నాహాలను సమీక్షించడానికి జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సోమవారం శ్రీనగర్‌లోని పంథా చౌక్‌లోని అమర్‌నాథ్ యాత్ర రవాణా శిబిరాన్ని సందర్శించారు. అధికారుల్ని అడిగి వివరాలు తెలుసుకుని తగు సూచనలు చేశారు.

## హైడ్రాతో రేవంత్ దారుణంగా వ్యవహరిస్తున్నారు

మొదటి పేజీ తరువాయి...

ఇల్లు కూలగొట్టుడే.. అడ్డమొచ్చిన వాళ్లను బుల్డోజర్లతో తొక్కవలసిందే అన్నట్లుగా రేవంత్ రెడ్డి స్టేట్ మెంట్ ఇస్తున్నాడని ఎంపీ ఈటల అన్నారు. అయితే, ఇంటెలిజన్స్ వ్యవస్థ అయినా ఇక్కడి ప్రజల పరిస్థితి చెప్తుంటరు కదా.. అయినా సీఎం రేవంత్ ఎందుకు వినడం లేదని బీజేపీ ఎంపీ ఈటల ప్రశ్నించారు. ఎవరు చెప్పినా వినని వారిని నాయకుడు అనరు.. సైకో అంటారని విమర్శించారు. ఇక, ప్రజలు కంటి మీద కునుకు లేకుండా బాధపడుతూ.. ఆత్మహత్య చేసుకుంటుంటే.. నవ్వే వాళ్లను సైకో అంటారు.. కోర్టుల్లో అడ్వకేట్లు వాదిస్తరు.. అంతిమ న్యాయనిర్ణేత జడ్జిది ఉంటది.. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ కర్తవ్యం ఆ పార్టీకి ఉంటది.. ఆయా పార్టీల ఎజెండా ఆయా పార్టీలకు ఉంటది.. కానీ, అంతిమంగా న్యాయ నిర్ణేతలు ప్రజలే ఉంటారు అని ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు.



ప్రజా సమస్యలు పరిశీలిస్తున్న మాజీ కౌన్సిలర్ వెంకటేష్

## ప్రజా సమస్యల పరిష్కారమే శుభోదయం కార్యక్రమం

### డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్

రాజేంద్రనగర్,మే12(ప్రభాత ఉదయం) ప్రజల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల్లో ఉంటూ పని చేస్తుందని మాజీ కౌన్సిలర్,మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ కురుమ అన్నారు.పార్టీ యువ నాయకుడు,రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పి.కార్తీక్ రెడ్డి ఆదేశాల మేరకు డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ కురుమ అధ్యక్షతన శుభోదయం మైలార్ దేవ్ పల్లి ప్రధాన గ్రామంలో పర్యటించారు.అందులో భాగంగా ఉమ్మడి హనుమాన్ దేవాలయం వీధిలో ఎక్కడ చూసినా సివరేజ్ మ్యానుహెూల్ పొంగి మురికి నీరు రోడ్లపై ఏరులై పారుతుందని స్థానికంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.దీంతో పాటు మంచినీటి సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలకు కనీసం ట్యాంకర్ల ద్వారా మంచి నీరు అందించడానికి చర్యలు తీసుకోవడం లేదన్నారు.అభివృద్ధి,ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రధాన ఎజెండాగా చేసుకొని అనునిత్యం శ్రమిస్తున్నానని తెలిపారు.స్థానిక ప్రజా ప్రతినిధులు సైతం ఈ సమస్యలపై దృష్టి సారించకపోవడం ఏంటని ప్రశ్నించారు.ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని పార్టీ తరపున కోరారు.ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించానని తెలిపారు.ఈ కార్యక్రమంలో యువ అధ్యక్షులు అక్కెం రఘు యాదవ్,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎన్.రాముయాదవ్,మైసి రెడ్డి,రాజేష్ యాదవ్,అరుణ్ ముదిరాజ్, చిరంజీవి, కొంపల్లి జగదీష్,రాజు,ఆప్కో రాజు,భగవాన్ దాస్,రాజు, ప్రవీణ్, వెంకటరమణ ,అశోక్ కుమార్,సందీప్,భాస్కర్,సునీల్,సరికొండ,దుర్గేష్,భూదేవి,సరిత,అరుణారెడ్డి,బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.




## పార్టీ బలోపేతనే లక్ష్యంగా పనిచేయాలి

### బిజెపి పార్టీ జిల్లా సంరక్షణ ప్రబారి కంజర్ల ప్రకాష్

రాజేంద్ర నగర్,మే12 (ప్రభాత ఉదయం):బిజెపి పార్టీలో క్రియాశీలక సభ్యత్వం ఉన్న సభ్యులను మణికొండ మున్సిపాలిటీ కమిటీకి ఎన్నుకోవడనికి సభ్యుల పేర్లను పరిశీలన కోసం తీసుకోవడం జరిగిందని బిజెపి పార్టీ జిల్లా సంరక్షణ ప్రబారి కంజర్ల ప్రకాష్ తెలిపారు.సోమవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో భారతీయ జనతా పార్టీ(శాఖ)రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మణికొండ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ నూతన కమిటీ ఎన్నుకొనుటకు సమావేశం నిర్వహించడనికి ముఖ్య అతిథిగా జిల్లా సంరక్షణ ప్రబారి కంజర్ల ప్రకాష్ విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భారతీయ జనతా పార్టీ కార్యకర్తల పేర్లు పరిశీలించడం జరిగిందన్నారు.పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసే సభ్యుల పేర్లను పరిశీలనచడం జరుగుతుందన్నారు.అంతేకాకుండా పార్టీలో క్రియాశీలక సభ్యత్వం ఉన్న సభ్యులకు ప్రాముఖ్యత కల్పించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి అంజన్ కుమార్ గౌడ్,మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కొండకల నరేందర్ రెడ్డి,భారతీయ జనతా పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు బి.రవికాంత్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు చిలుకూరి బీరప్ప,మాజీ కోఆప్షన్ సభ్యులు జై సిద్ధప్ప,కౌన్సిలర్ వందన నాగేష్,మాజీ కో ఆప్షన్ సభ్యులు జె.లక్ష్మి,మహిళా మోర్చా అధ్యక్షురాలు అనిత అప్పల,సి.సంగీత,ఈ సుజాత,ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శివ కుమార్,ఈ నర్సింగ్ రావు,పి.సత్యనారాయణ,బి శంకర్,ఎం.గణేష్,ఈ జ్ఞానేశ్వర్,జి.వినోద్,రేఖ ఆనందరావు,శంకర్ సింగ్,ఓర్స్ మధు,బాలకృష్ణ,ఏ.రాములు,భీమ్ రెడ్డి,బి.శివ కుమార్,భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర సమాచార కమిషనర్ గా దేశాల భూపాల్

### అంచలంచలుగా పైకొచ్చిన దళిత బిడ్డ
### తండ్రి దేశాల శ్రీశైలం అడుగుజాడల్లో సమాజ సేవ
### సామాజిక కార్యకర్తగా, న్యాయవాదిగా, న్యాయ సలహా కేంద్ర నిర్వాహకుడిగా సేవలు



బుద్వేల్, మే 12(ప్రభాత ఉదయం) : రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ నివాసి, 35 సంవత్సరాలుగా రాజేంద్రనగర్ ఇంద్రారెడ్డి నగర్ లో నివాసం ఉంటున్న న్యాయవాది, సామాజిక కార్యకర్త దేశాల భూపాల్ రాష్ట్ర సమాచార కమిషనర్ గా నియమితులయ్యారు. పెంజర్ల గ్రామానికి చెందిన దళిత నాయకుడు, రాజకీయాలలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న పెంజర్ల శ్రీశైలం పెద్ద కుమారుడే దేశాల భూపాల్. చిన్ననాటి నుంచి కష్టపడి చదివి ఎంఏ పొలిటికల్ సైన్స్ పూర్తి చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయాలో ఎల్.ఎల్.బి చేసి న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. అంతకుముందు ఆయన ప్రొఫెసర్ శాంతా సిన్హా ఆధ్వర్యంలో నడపబడుతున్న మామిడిపూడి వెంకటరంగయ్య ఫౌండేషన్ లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం చాలా సంవత్సరాలు పనిచేశారు. మొదటి నుంచి సేవా భావం కలిగిన వ్యక్తిగా, సమాజం పట్ల , దేశం పట్ల, రాజకీయాల పట్ల అవగాహన ఉన్న వ్యక్తిగా దేశాల భూపాల్ కు పేరుంది. దేశాల భూపాల్ కు భార్య పద్మ ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

**మంచి వక్తగా...**

35 సంవత్సరాలు పైగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్న దేశాల భూపాల్ మంచి వక్తగా పేరు సంపాదించుకున్నారు. రాజకీయ, సాంఘిక , ఆర్థిక రంగాలలో ఆయనకు అపారమైన అనుభవం ఉంది. ఆయన ఒక అంశంపై మాట్లాడడం ప్రారంభిస్తే అనర్గళంగా మాట్లాడుతారనే చర్చ ప్రజల్లో ఉంది. న్యాయవాద వృత్తిని తీసుకున్న , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లాంటి మహనీయుల జీవిత చరిత్ర గురించి మాట్లాడిన, రాజకీయాల గురించి మాట్లాడిన ఆయన ఎంతో చక్కగా మాట్లాడుతాడని పేరు ఉంది.

**సమాచార కమిషనర్ గా రాణించాలని....**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు దక్కాల్సిన హక్కులు, ప్రభుత్వాలు, ప్రవేట్ సంస్థలలో ప్రజలకు రావాల్సిన సదుపాయాలు తదితర అంశాల గురించి సమాచార కమిషనర్ గా ఆయన తన విధులను చక్కగా నిర్వర్తిస్తారని ఆయన గురించి తెలిసిన పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆ దిశలో సమాచార కమిషనర్ గా నియమితులైన దేశాల భూపాల్ పని చేస్తారని ఆశిద్దాం.

# రాష్ట్ర సమాచారశాఖ కమిషనర్‌గా రాజేంద్రనగర్‌కు చెందిన దేశాల భూపాల్ నియామకం

బుద్వేల్ , మే 12 (ప్రభాత ఉదయం) : రాష్ట్ర సమాచార కమిషనర్ గా రాజేంద్రనగర్ ఇంద్రారెడ్డినగర్ కు చెందిన న్యాయవాది దేశాల భూపాల్ నియమితులు అయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామక్రిష్ణారావు జీఓ నెం 111 ద్వారా ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్ర సమాచార కమిషనర్లుగా పి.వి శ్రీనివాసరావు, మోహిసినె పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డిలు నియమితులైనారు. వీరు మూడు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగుతారు.


**రాజేంద్రనగర్ లో హర్షాతిరేకాలు**

రాజేంద్రనగర్ ఇంద్రారెడ్డినగర్ కి చెందిన దేశాల భూపాల్ న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఎం ఎ పొలిటికల్ సైన్స్ తో పాటు ఉస్మానియ యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్ బీ పూర్తి చేశారు. మామిడిపూడి వెంకట రంగయ్య ఫౌండేషన్ (ఎంవీఎఫ్) ద్వారా ఆయన బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం చాలా సంవత్సరాలు పనిచేశారు. న్యాయ సలహా కేం ద్రాలను ఏర్పాటు చేసి అనేక మందికి న్యాయ సలహాలను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ లో రాష్ట్ర కో కన్వీనర్ గా పనిచేస్తున్నారు. దేశాల భూపాల్ రాష్ట్ర సమాచార కమిషనర్ నియమితులు కావడంతో ఆయన స్నేహితులు, స్థానికులు,



దేశాల భూపాల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న స్నేహితులు అప్పారెడ్డి గూడెం భీమయ్య, ఎస్ వీరాంజనేయులు, క్యాసారం శంకర్ రావులు

జర్నలిస్టులు ఎస్.వీరాంజనేయులు, క్యాసారం శంకర్ రావు , అప్పారెడ్డి గూడెం భీమయ్య, ఎం.బాలసుబ్రమణ్యం, యు. శ్రీకాంత్ లు శుభాకాంక్షలు తెలియజేశారు. పీవీ నర్సింహ్మారావు



దేశాల భూపాల్ కు శుభాకాంక్షలు తెలుపుతున్న జర్నలిస్టులు ఎం బాలసుబ్రమణ్యం, యు. శ్రీకాంత్ లు

పశువైద్య విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు డాక్టర్ కాటం శ్రీధర్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ వన్నోజ్ సుదాకర్ లు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు.



మైలార్ దేవుపల్లి లో రోడ్ల పై మురుగునీటి ని చూపుతున్న బీ ఆర్ ఎస్ నాయకులు

## రోడ్లపై మురుగునీరు పారుతున్న పట్టించుకోరా

### త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలి

బుద్వేల్, మే 12(ప్రభాత ఉదయం): మైలార్దేవుపల్లి బస్తీలో సోమవారం బీఆర్ఎస్ మైలార్దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేశ్ ఆద్వర్యంలో ఆ పార్టీ నాయకులు పర్యటించారు. బస్తీలో గల ఉమ్మడి హనుమాన్ దేవాలయం పరిసరాలలో డ్రైనేజీ మ్యాన్ హెూల్ లు పొంగి పారుతున్నాయని, అయినా అధికారులు గానీ సిబ్బంది గానీ పట్టించుకోవడం లేదన్నారు. మైలార్ దేవుపల్లి జలమం డలి అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బస్తీలో ఎక్కడ బోరు నీరు రావడం లేదని, మంచినీటి సరఫరా కూడా అంతంత మాత్రంగానే ఉందని బస్తీ ప్రజలు బీఆర్ఎస్ నాయకుల దృ ష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎస్. వెంకటేశ్ మాట్లాడుతూ, వేసవి లో నీటి సమస్యలున్న మైలార్దేవుపల్లి బస్తీకి ట్యాంకర్ల ద్వారా నైన నీటి సరఫరా చేయాలన్నారు. నాలుగు సార్లు గెలిచిన ఎమ్మెల్యే. రెండు సార్లు గెలిచిన కార్పొరేటర్ లు మైలార్దేవుపల్లిలోనే ఉన్నప్పటికీ మ్యాన్ హెూల్ లు పొంగి పారుతున్నాయని, నీటి సమస్యలు ఉన్నాయని, ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని వెంకటేశ్ కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నోముల రాము యాదవ్, యువత అధ్యక్షులు అక్కెం రాఘవేందర్ యాదవ్, అరుణ్ ముదిరాజ్, చిరంజీవి. కొంపల్లి జగదీశ్, రాజు, అప్కో రాజు, భగవాన్ దాస్, రాజు, ప్రవీణ్, వెంకటరమణ, అశోక్ కుమార్, సందీప్, బాస్కర్, సునీల్, సరికొండ మల్లేశ్, భూదేవి, సరిత, అరుణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 500 మంది ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అరటి పండ్లు పంపిణీ చేసిన వేలేరు మాజీ సర్పంచ్

వరంగల్ మే 12 ,(ప్రభాత ఉదయం బ్యూరో) కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉపాధి హామీ పథకం ఎన్నటికీ మరిచిపోలేనిదని, రోజంతా ఎండలో పనిచేయకుండా ఉదయం 7 గంల నుండి 10 గంల వరకు పనిచేసి సాధారణ జీవనం గడుపుతున్న కూలీలకు ఉపాధి హామీ పథకం చాలా ఉపయోగకరంగా ఉందని వేలేరు గ్రామ మాజీ ఉపసర్పంచ్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సద్దాం హుస్సేన్ తెలిపారు. ఉమ్మడివరంగల్ జిల్లా స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గ పరిధిలోని వేలేరు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రదేశానికి మాజీ ఉపసర్పంచ్ కాంగ్రెస్ నాయకులు వెళ్లి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎండ తీవ్రత వలన ఉపాధి కూలీలకు ఇబ్బందులు కలుగకుండా ఉండాలని , సోమవారం సద్దాం హుస్సేన్ దాదాపు 500 మంది ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అరటి పండ్లు అందజేశారు. చేసే సహాయం చిన్నదే అయినా మంచి తృప్తిని ఇచ్చే విధంగా ఉందని తెలిపారు. ఉపాధి హామీ కూలీలు సంతోషాన్ని వ్యక్తం చేస్తు సద్దాం హుస్సేన్కు కృతజ్ఞతలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో వేలేరు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కారం శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు పిన్నింటి తిరుపతి రెడ్డి, జుర్రు సంపత్, మాజీ వార్డు సభ్యులు బైరి అనిల్, అక్కల శంకర్, గద్దం వీరన్న, ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షులు జెట్టి అరవింద్, గొల్లకృష్ణం పల్లి గ్రామ అధ్యక్షులు కన్నెబోయిన సంపత్, అసెంబ్లీ యూత్ ఉపాధ్యక్షులు అక్కల ప్రశాంత్, కూరపాటి శ్రీకాంత్, ఆరిఫ్, రఫీ, రియాజ్, గుండు సాంబరాజు, తదితరులు పాల్గొన్నారు

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



చెన్నూర్, మే 12. (ప్రభాత ఉదయం) : రాత్రి వేళల్లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మైనింగ్ ఎస్ఆర్వో నగావత్ నరేష్ నాయక్ పేర్కొన్నారు. కిష్టంపేట గ్రామానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు గుట్టు చప్పుడు కాకుండా సుద్దాల వాగు నుండి తరలిస్తున్న ఇసుక ట్రాక్టరుతో పాటు సుబ్బరాం పల్లి వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ బీఆర్ఎస్ నాయకుడికి చెందిన రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఆయన తెలిపారు. ట్రాక్టర్లు పట్టుకునే సమయంలో అడ్డుకునే ప్రయత్నం చేసిన ఆన్లైన్ ట్రాక్టర్ యూనియన్ సభ్యులపై కిష్టంపేట కాంగ్రెస్ నేత దాడికి సైతం యత్నించాడని, అక్రమంగా ఇసుక తరలించడమే కాకుండా అడ్డువచ్చిన వారిపై దాడికి యత్నించడం సమంజసం కాదని, అనుమతులు లేకుండా అక్రమ ఇసుక దందా నిర్వహించేవారు ఎంతవారైనా ఉపేక్షించబోమని, పట్టుకున్న ట్రాక్టర్లను చెన్నూరు పోలీసులకు అప్పగించినట్లు నరేష్ తెలిపారు.



## రాందేవరావ్ ఆస్పత్రిలో ఘనంగా ప్రపంచ నర్సుల దినోత్సవం వేడుకలు

### ఆరోగ్య పరిరక్షణ విభాగంలో నర్సుల పాత్ర అత్యంత కీలకం

కూకట్‌పల్లి,మే 12 (ప్రభాత ఉదయం) ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా రాందేవరావ్ ఆసుపత్రిలో ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణ విభాగంలో నర్సుల పాత్ర అత్యంత కీలకమైనది. నర్సులు అందించే సేవలు దైవీకమైనవి. అందువల్ల నర్సింగ్ వృత్తిని నోబెల్ ప్రొఫెషన్ అంటారు. ఈ నర్సులను సత్కరించడం అంటే దేవుడిని సత్కరించడంతో సమానం. ఇలాంటి విషయాల్లో రాందేవరావ్ ఆసుపత్రి ఎప్పుడు ముందుంటుంది. గత 17 సంవత్సరాలుగా ఇంటర్నేషనల్ నర్సింగ్ దినోత్సవాన్ని అత్యంత ఉన్నతంగా, వైభవంగా జరుపుతున్నాము. ఈ కార్యక్రమానికి శ్రీమతి లక్ష్మీ కమలాకర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి, హార్టికల్చర్ మరియు రేఖ తెరపి గ్రాండ్ మాస్టర్ ముఖ్య అతిథులుగా హాజరైట్కు ఈ కార్యక్రమానికి మరింత వన్నె తెచ్చారు. రాందేవరావ్ ఆసుపత్రిలోని నర్సులు అందరు కూడా ఒక ఫ్లోరెన్స్ నైటింగేల్, ఒక మదర్ థెరిస్సా, ఒక సిస్టర్ నిర్మల ను ఆదర్శంగా తీసుకొని నర్సులు వాళ్ల అడుగుజాడల్లో నడవాలని మెడికల్ డైరెక్టర్ డా. కమలాకర్ అన్నారు. మన భారతీయ సాంప్రదాయం ప్రకారం పెద్దల్ని గౌరవించడం అనేది ఒక ఆచారం. అందులో భాగంగా విశ్రాంతి నర్సులైన సిస్టర్స్ రాహేల్, కమల చార్లెస్, సరస్వతి ని, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ అర్చన మోరే ని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ ప్లెడ్జ్ ను రాందేవ్ అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెంట్ పి.శోభ రాణి అందరితో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నర్సులను, శివానంద రిహాబిలిటేషన్ నర్సులను, కుముదుని దేవి నర్సింగ్ కాలేజ్ సిబ్బందిని, విద్యార్థినిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఆసుపత్రి డాక్టర్లు, స్పెషల్ డాక్టర్లు, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ఆసుపత్రి సీఈవో యోబు తెలిపారు.

## గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో చేరడానికి కౌన్సిలింగ్ కు రండి

బుద్వేల్, మే 12(ప్రభాత ఉదయం) హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలలో గల గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో బాల, బాలికలకు ప్రవేశాల కోసం ఈ నెల 15,16 తేదీలలో హయత్నగర్ లో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు రీజినల్ కో ఆర్డినేటర్ కె. నాగార్జున రావు ఓ ప్రకటనలో తెలి పారు. 15వ తేదీన బాలురు, 16న బాలికలకు ఉదయం 10 గంటల సమయంలో కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుందన్నారు. కౌన్సిలింగ్ కు హాజరయ్యే విద్యార్థులు 10వ తరగతి లో సాదిం చిన మార్కులు, బదిలీ సర్టిఫికెట్, స్టడీ, కండక్ట్ సర్టిఫికెట్, కుల, ఆదాయ దృవీకరణ పత్రాలు తీసుకురావాల్సి ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నివాసం ఉండే వారు రూ. 15 లక్షల లోపు, పట్టణ ప్రాంతాలలో నివాసం ఉండే వారు రూ. 2 లక్షల లోపు ఆదాయ దృవీకరణ పత్రం తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ఆధార్ జిరాక్స్, స్పోర్స్, ఫిజికల్ హ్యాండీ క్యాప్డ్ దృవీకరణ ఉం టే వాటిని కూడా తీసుకొని రావాలన్నారు. మూడు కలర్ ఫొటోలతో పాటు దృవీకరణ పత్రాలన్ని రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9502050715, 9603481550, 9014447898 నెంబర్లలో సంప్రదించవచ్చున్నారు.

## పైపు లైన్లకు మరమ్మత్తులు



చెన్నూర్, మే 12. (ప్రభాత ఉదయం): చెన్నూరు మున్సిపాలిటీ పరిధిలో గోదావరి రోడ్డున లీక్ అవుతున్న పైపు లైన్లకు మరమ్మత్తులు నిర్వహించినట్లు చెన్నూరు మున్సిపల్ కమీషనర్ మురళీకృష్ణ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ముందు చూపు లేకుండా పైపు లైన్లు వేశారని, మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధి పనుల్లో భాగంగా లీకులు ఏర్పడగా, గత కొద్ది రోజులు మున్సిపాలిటీలోని పలు వార్డులకు నీటి సరఫరా నిలిచిపోయిందని, ఇట్టి మరమ్మత్తులతో మున్సిపాలిటీలోని ప్రతీ వార్డులో నీటి సమస్య అనేదే ఉండదని, వేసవికాల నేపథ్యంలో ప్రతీ ఇంటికి త్రాగునీరు అందించడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే వెంటనే వార్డు ఆఫీసరుకు సమాచారం అందించి, తమకు సహకరించి, మున్సిపాలిటీ అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని కమీషనర్ మురళీకృష్ణ కోరారు.

